# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 16, జులై 2026


## సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా..

★ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశం

★ సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్ ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**సిర్పూర్ (టి), జూలై 15, ప్రభాతవార్త**

సిర్పూర్(టి) పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ నితికా పంత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించిన ఆమె ఎస్ఐ సాగర్‌కు పలు సూచనలు చేశారు. అంతర్రాష్ట్ర సరిహద్దు మార్గాలపై నిరంతరం నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు వాహన తనిఖీలు, రాత్రి గస్తీ, సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, నేర పరిశోధన రికార్డులను పరిశీలించిన ఎస్పీ.. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన విచారణతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఆమె.. నిఘా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఎస్పీ.. అక్రమ మద్యం, గంజాయి, బెట్టింగ్, జూదం, మట్కా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, విధుల్లో క్రమశిక్షణ పాటించడం, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడం ప్రతి పోలీసు సిబ్బంది కర్తవ్యమని ఎస్పీ నితికా పంత్ పేర్కొన్నారు.



## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

❋ రాజీ పడకుండా వసతులు అందించాలి

❋ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశం

❋ ఉపాధి అవకాశాలు లభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి

**భైంసా, జులై 15, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బుధవారం ఆయన వర్సిటీని సందర్శించి, పరిపాలనా భవనంలో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాంపస్‌లో విద్యార్థులకు నిరంతర విద్యుత్, సురక్షిత తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పించడంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందుతున్న వసతులు, అడ్మిషన్ల ప్రక్రియ, విద్యాబోధన తీరుపై ఆరా తీశారు. ఏ విద్యార్థీ ఆర్థిక, సామాజిక కారణాల వల్ల చదువు మధ్యలో ఆపేయకుండా చూడాల్సిన బాధ్యత మిగతా 2లో..


## నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

❋ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, జూలై 15, ప్రభాతవార్త :**



ప్రభుత్వ ఆసుపత్రులకు వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే ప్రజలకు నాణ్యమైన మరియు సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం రోజున బెల్లంపల్లి మండల కేంద్రంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, ల్యాబ్ సేవలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు మరియు పరిశుభ్రత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులతో సానుభూతితో మరియు స్నేహపూర్వకంగా వ్యవహరించడం వైద్య సిబ్బంది ప్రధాన బాధ్యతగా భావించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు సంబంధించిన వివరాలను సమీక్షించి, ప్రతి గర్భిణీ సురక్షిత ప్రసవం కోసం తప్పనిసరిగా ఆసుపత్రులనే ఆశ్రయించేలా అవగాహన కార్యక్రమాలను మిగతా 2లో..



## వివిధ ప్రభుత్వ సేవా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్

2లో..

– ఆసిఫాబాద్, జూలై 15, ప్రభాతవార్త :

## విధుల పట్ల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

✪ ప్రాజెక్ట్ అధికారి ఐటీడీఏ ఉట్నూర్

**కెరమెరి, జూలై 15, ప్రభాతవార్త:**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం, హట్టి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడం, పాఠశాల విద్యా వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా వ్యవహరించిన ఇద్దరు ఉపాధ్యాయులపై ప్రాజెక్ట్ అధికారి, ఐటీడీఏ ఉట్నూర్ శ్రీ మంద మకరందు పరిపాలనా పరమైన చర్యలు తీసుకున్నారు ఏమేరకుఆసిఫాబాద్ డిప్యూటీ డైరెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసారుహట్టి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి పంచాపులపై పరిపాలనా చర్యలు తీసుకుంటూ, ఆమెను గిన్నెధరి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ ఎస్ ఏ సోషల్ ఉపాధ్యాయురాలిగా రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు .అదే పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ సిఆర్‌టి గా పనిచేస్తున్న శ్రీ నాగోరావ్ ను హట్టి పాఠశాల నుండి సల్గుపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ సి ఆర్ టి గా రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే, సల్గుపల్లి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న అరవింద్‌ను హట్టి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు,అనార్పల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బయాలజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సోనేరావ్ ను హట్టి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు గా ఎఫ్ ఎ సి హెచ్‌ఎం గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గిరిజన విద్యను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తెలిపారుఅలాగే, ఏ పాఠశాలలోనైనా విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించే వారిపై నిరంతర నిఘా ఉంచి, విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే ఉపాధ్యాయులపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన పరిపాలనా చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు స్పష్టం చేశారు.

## వివిధ ప్రభుత్వ సేవా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్

**ఆసిఫాబాద్, జూలై 15, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ సేవా, విద్యా, సాంకేతిక కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మాట్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. బుధవారం జిల్లా కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొమురం భీం బెలూన్ థియేటర్‌ను సందర్శించారు. గిరిజన ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించే విద్యా సంబంధిత లఘు చిత్రాలను అధికంగా ప్రదర్శించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరుగుతున్న సదరమ్ శిబిరంను పరిశీలించి దివ్యాంగులకు తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, అర్హులైన వారికి ధృవీకరణ పత్రాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుండి జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న సామాజిక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించి, నాణ్యమైన బోధన కోసం ఆధునిక పద్ధతులు, డిజిటల్ సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని సూచించారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

అధికారులదేనని, చదువు పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశాలు లభించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. వర్సిటీలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యా ప్రమాణాలను పెంచేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్సిటీ అభివృద్ధి, అందుబాటులో ఉన్న వసతుల గురించి చైర్మన్‌కు వివరించారు. అనంతరం చైర్మన్‌ను, కమిషన్ సభ్యులను అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కుర్సం నీలాదేవి, వైస్ చాన్సలర్ గోవర్ధన్, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ వెంకట రామయ్య, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ అజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించాలి

**ఆసిఫాబాద్, జూలై 15, ప్రభాతవార్త :**



బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదురుగా నిర్మించిన వసతి గృహం వద్ద సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తయిన వసతి గృహాన్ని పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ మాట్లాడుతూ వసతి గృహ నిర్మాణం పూర్తై దాదాపు రెండేళ్లు గడిచినా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. దీంతో బీసీ బాలికల కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత పదేళ్లుగా బీసీ బాలికల వసతి గృహం అద్దె భవనంలో అరకొర సౌకర్యాలతో, ఇరుకు గదుల్లో విద్యార్థినులు నివసిస్తూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన వసతి గృహాన్ని ప్రారంభిస్తే సుమారు 300 మంది విద్యార్థినులకు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పందించి వసతి గృహాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తీక్, గేడం టికానంద్, నాయకులు తిరుపతి, రాజ్‌కుమార్, మల్లేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి శివారులో నేటి నుంచి భూముల రీసర్వే

**- పట్టాదారులు తప్పనిసరిగా హాజరై సహకరించాలి : తహసీల్దార్ సాయికృష్ణ**

**వేమనపల్లి, జూలై 15, ప్రభాతవార్త :**

వేమనపల్లి మండలంలోని కొత్తపల్లి రెవెన్యూ గ్రామ శివారు భూముల రీ సర్వే ప్రక్రియ గురువారం (జూలై 16) నుంచి ప్రారంభం కానుందని తహసీల్దార్ సాయికృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కొత్తపల్లి శివారులో భూములు కలిగిన పట్టాదారులు, రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, ఇతర అవసరమైన భూ పత్రాలతో సర్వే సమయంలో తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు. సర్వే బృందానికి పూర్తి సహకారం అందించడం ద్వారా భూ వివరాలు ఖచ్చితంగా నమోదవుతాయని, భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా పారదర్శకంగా రీసర్వే నిర్వహిస్తామని తెలిపారు. రైతులు, భూ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధికారులకు సహకరించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

బలోపేతం చేయాలని ఆదేశించారు. ల్యాబ్ సేవలను పరిశీలించిన ఆయన, ప్రతిరోజు నిర్వహిస్తున్న పరీక్షల వివరాలను తెలుసుకుని సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన మందులను సమృద్ధిగా నిల్వ ఉంచాలని అధికారులకు సూచించారు. అలాగే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తదనంతరం బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామితో కలిసి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించి, పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించబడుతున్నాయని తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను సమీక్షించారు. ఈ నెల 24వ తేదీ లోగా ప్రక్రియను పూర్తి చేసి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి మరియు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. అనంతరం కాసిపేట మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, అదనపు గదులు, భోజనశాల మరియు మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వంటశాలను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత మరియు పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.



## ఆడేపల్లి, డబ్బా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే తనిఖీ

**చింతలమానేపల్లి, జూలై 15, ప్రభాతవార్త;**

మండలంలోని ఆడేపల్లి,డబ్బా గ్రామాల్లో సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హౌసింగ్ ఏఈఈ అర్జున్, పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, కుషియుద్దీన్‌లతో కలిసి సర్వే తీరును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించినమార్గదర్శకాలకు లోబడి, ఎలాంటి లోపాలు లేకుండా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను అత్యంత పారదర్శకంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్, పంచాయతీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## కోసిని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 15, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు బుధవారం సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) జాడే ఉత్తంకుమార్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) ఇర్ఫాన్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) రాంప్రసాద్ సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ సరఫరా వ్యవస్థ, ట్రాన్స్‌ఫార్మర్లు, స్విచ్‌గేర్, రక్షణ పరికరాలు, నిర్వహణ పనులు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని, పరికరాల నిర్వహణను నిరంతరం చేపట్టాలని, లోపాలు గుర్తించిన వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులపై వెంటనే స్పందించి, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం విద్యుత్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ సిబ్బంది సబ్‌స్టేషన్‌కు సంబంధించిన సాంకేతిక వివరాలు, నిర్వహణ చర్యలు, సరఫరా పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల

**- రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో కేజీబీవీ విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటిన ఎస్పీ**

**- భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి**

**భైంసా, జులై 15, ప్రభాతవార్త:**



భైంసా పట్టణంలోని భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ముఖ్య అతిథిగా హాజరై, పోలీస్ అధికారులు, సిబ్బంది, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులతో కలిసి ఉత్సాహంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జిల్లా ఎస్పీని ఆప్యాయంగా పలకరించగా, ఆమె వారితో కాసేపు ముచ్చటించారు. విద్యార్థినులంతా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు చాక్లెట్లు, అరటిపండ్లు పంపిణీ చేసి అభినందించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. నేటి అవసరాల కోసమే కాకుండా భావితరాల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు బాధ్యతగా కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, రవీంద్ర నాయక్, సాయి కుమార్, దీపక్, ఎస్ఐలు అశోక్, సుప్రియ, జుబేర్, నవనీత్, పోలీస్ సిబ్బంది, కేజీబీవీ ఉపాధ్యాయులు మరియు 120 మంది విద్యార్థినులు పాల్గొని మొక్కలు నాటారు.

## ఎన్యుమరేషన్ ఫారాల ఆన్‌లైన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

**- బీఎల్‌ఓ యాప్ పనితీరు పరిశీలన.. ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, జూలై 15, ప్రభాతవార్త:**



ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా జిల్లాలో పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం భైంసా పట్టణంతో పాటు నిర్మల్ పట్టణంలోని 24వ వార్డులో కొనసాగుతున్న ఎస్ఐఆర్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంపిణీ చేసిన ఫారాల వివరాలు, ఆన్‌లైన్ నమోదు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి జాప్యం లేకుండా మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మల్‌లో పర్యటించిన సందర్భంగా బీఎల్ఓ యాప్ పనితీరును పరిశీలించి, ఆన్‌లైన్ ఎంట్రీలపై ఆరా తీశారు. స్థానిక ఓటర్లతో మాట్లాడి ఎస్ఐఆర్ ఫారాలను సక్రమంగా పూర్తి చేసి వెంటనే బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి కుటుంబం నుండి సమాచారాన్ని సేకరించాలని, అర్హులైన లబ్ధిదారులెవరూ మిగిలిపోకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసిల్దార్లు శశిభూషణ్, రాజు, ఎంపీడీవో నీరజ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్-2026 విజయవంతానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలి

- ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

**బెల్లంపల్లి, జులై 15, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ, 4వ, 17వ వార్డుల్లో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్–2026) అవగాహన కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొని పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్ఏ లు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలకు మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఏలు, పార్టీ నాయకులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, వివరాల సవరణ, అనర్హుల పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఎస్ఐఆర్–2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తూ, మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజ్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పనులు చేపడతామని వెల్లడించారు. అదేవిధంగా పట్టణంలో రోడ్ల విస్తరణ (రోడ్ వైడెనింగ్) మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి మరియు సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసం వల్లనే ఎమ్మెల్యేగా సేవ చేసే అవకాశం లభించిందని, ప్రజాసేవే తన ప్రధాన ధ్యేయమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం తన బాధ్యతగా భావిస్తూ, బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## నెన్నెల మండల ప్రొహిబిటెడ్ భూముల సమస్య పరిష్కారానికి వినతి

**బెల్లంపల్లి, ప్రభాతవార్త :**



నెన్నెల మండలంలోని ప్రొహిబిటెడ్ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆధ్వర్యంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బొమ్మెన హరీష్ గౌడ్, ఘన్‌పూర్ గ్రామ సర్పంచ్ గన్న సతీష్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రొహిబిటెడ్ భూముల సమస్య కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పంట రుణాలు పొందడంలో సమస్యలు తలెత్తి రైతుల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యను అత్యవసరంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుని పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## భూమి కేటాయింపుపై టీపీసీసీ అధ్యక్షుడికి కృతజ్ఞతలు

**ఆసిఫాబాద్, ప్రభాతవార్త :**



ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమి కేటాయింపులో ప్రత్యేక చొరవ తీసుకున్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు మాట్లాడుతూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయ నిర్మాణానికి కూడా ప్రభుత్వం త్వరలోనే భూమి కేటాయిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహకారంతో ఆ ప్రక్రియ కూడా త్వరలోనే సాకారం అవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీహరి రావు కూడా పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం చేయకుండా ఎస్ఐఆర్ దరఖాస్తులు పూర్తి చేసుకోవాలి

**ఆసిఫాబాద్ టౌన్, జులై 15, ప్రభాతవార్త**



అర్హులైన ప్రతి ఒక్కరు నిర్లక్ష్యం చేయకుండా తమ ఎస్ఐఆర్ దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆశా, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ సూచించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని 16వ వార్డుతో పాటు పలు వార్డుల పరిధిలో కొనసాగుతున్న "ఎస్ఐఆర్" దరఖాస్తుల ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం వారు కౌన్సిలర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ తీరును, ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డుల్లో ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాధాన్యతను వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దూడల లక్ష్మి, సాలం బీన్ అహ్మద్, రాపర్తి కార్తిక్, బీఎల్ఓ లక్ష్మి, సూపర్వైజర్ సాయి నాయకులు దూడల అశోక్, అబూ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుడి కుమారుడు గ్రూప్-1లో విజయం సాధించడం గర్వకారణం

- మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ

**మందమర్రి, జులై 15, ప్రభాతవార్త :**

సింగరేణి కార్మికులు తమ విధుల్లో కృషి చేస్తూనే, పిల్లలను ఉన్నత విద్యతో ప్రోత్సహించి జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (కేకే ఓసీపీ)లో కన్వేయర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న డి. రవీందర్ కుమారుడు డి. ప్రవీణ్ కుమార్ ఇటీవల ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డి.ఎస్.పి)గా ఎంపికయ్యారు. పెద్దపల్లిలో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్న ప్రవీణ్ కుమార్‌ను, ఆయన తండ్రి రవీందర్‌ను బుధవారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ సాధారణ కార్మిక కుటుంబానికి చెందిన రవీందర్ తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించి ఈ స్థాయికి చేర్చడం అభినందనీయమని తెలిపారు. డీఎస్పీగా ఎంపికైన ప్రవీణ్ కుమార్ తన సేవా కాలంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజానికి ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సింగరేణి కార్మికులందరూ గనుల్లో రక్షణ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా విధులు నిర్వహించాలని, కుటుంబాలకు అండగా నిలుస్తూ పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సి.హెచ్. అశోక్ పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై జిల్లా వ్యవసాయ అధికారి ఆకస్మిక తనిఖీలు

**వేమనపల్లి, జులై 15, ప్రభాతవార్త :**

ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందేలా చర్యలు చేపట్టిన జిల్లా వ్యవసాయ శాఖ, బుధవారం వేమనపల్లి మండలంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల విక్రయ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి ఈ. సురేఖ స్వయంగా దుకాణాలను సందర్శించి ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సులు, నగదు బిల్లులు, ధరల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా విక్రయదారులను ఉద్దేశించి మాట్లాడిన ఆమె, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి కొనుగోలు, అమ్మకాన్ని రికార్డుల్లో నమోదు చేయడంతో పాటు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులనే విక్రయించాలని ఆదేశించారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి రత్న సాయికృష్ణారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి బి. నిమాషాతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమి పూజ

- వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు
- మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు ఆలయ ఈఓ అంజనాదేవి పర్యవేక్షణలో శ్రీకారం

**భైంసా, జులై 15, ప్రభాతవార్త:**



భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ప్రముఖ విద్యా స్వరూపిణి, జ్ఞాన ప్రదాయిని అయిన నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయ పునర్నిర్మాణ పర్వంలో మరో మహత్తర ఘట్టం ఆవిష్కృతమైంది. భక్తుల మనోభీష్టాన్ని నెరవేరుస్తూ, అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పునాది పనులకు బుధవారం ఉదయం 11:00 గంటలకు శాస్త్రోక్తంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీకారం చుట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) అంజనాదేవి పర్యవేక్షణలో, ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో ఈ పవిత్ర భూమిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు, అర్చక స్వాములు మంగళకరమైన వేదమంత్రాలు, ఉపనిషత్ పఠనాల నడుమ విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, భూమాత పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నూతన శంకుస్థాపన పనులను మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా ప్రారంభించారు. అమ్మవారి నూతన మంగళ ప్రాకారాలు, దివ్యమైన కట్టడాలతో ఈ క్షేత్రం రాబోయే రోజుల్లో మరింత శోభాయమానంగా తీర్చిదిద్దబడుతుందని ఈ సందర్భంగా అర్చక బృందం ఆశీర్వచనాలు పలికారు. ఈ పరమ పవిత్రమైన కార్యక్రమంలో సైట్ ఇంజనీర్లు రామకృష్ణ, నాగరాజు, మురళీకృష్ణలతో పాటు ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థాన ఉన్నతాధికారులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు. అమ్మవారి నూతన దివ్యాలయం రూపుదిద్దుకోనుండటంతో బాసర క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత వెల్లివిరిసింది.

## అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**సారంగాపూర్, జులై 15, ప్రభాతవార్త:**



అనారోగ్యం భరించలేక మనస్తాపానికి గురై ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సారంగాపూర్ ఏఎస్ఐ వసంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన శివరాత్రి రాములు (64) గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. నిర్మల్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడు. గమనించిన భార్య, కుమారుడు వెంటనే ఆయన్ను కిందికి దించి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాములు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి కుమారుడు శివరాత్రి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## గోమాతకు జాతీయ హోదా కల్పించాలి

- గోవధపై సంపూర్ణ నిషేధం విధించాలి
- గోసంపద పరిరక్షణే మానవాళి మనుగడకు భరోసా అని గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ పిలుపు

**మంచిర్యాల, జులై 15, ప్రభాతవార్త :**



గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించి, దేశవ్యాప్తంగా గోవధను పూర్తిగా నిషేధించాలని గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ మంచిర్యాల జిల్లా సమితి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. బుధవారం విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభియాన్ కరపత్రాలను ఆవిష్కరించి ఉద్యమ లక్ష్యాలను వెల్లడించారు. గోవుకు జాతీయ గౌరవం కల్పించడంతో పాటు గోసేవ కోసం ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, గోరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గోసంపద వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యతకు మూలాధారమని, గోజాతి పరిరక్షణతోనే మానవ మనుగడకు భరోసా ఉంటుందని పేర్కొన్నారు. జులై 27నుంచి అక్టోబర్ 27 వరకు దేశవ్యాప్తంగా గో సమ్మాన్ దివస్ నిర్వహించి కోట్లాది సంతకాలను సేకరించి ప్రభుత్వాలకు సమర్పించనున్నట్లు తెలిపారు. గోమాత పరిరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సతీష్ భవాని స్వామి, రఘు అఘోరి గురు స్వామి, దొంతుల ముకేశ్, గొనె శ్యాంసుందర్ రావు, వేముల హరి ప్రసాద్, కర్ణకంటి రవీందర్, కండె బద్రి నారాయణ, చంద్రశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్ యాజమాన్యం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం

**- గోలెం వెంకటేశం**

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 15, ప్రభాతవార్త :**

సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 57వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిర్పూర్ పేపర్ మిల్లు ప్రధాన గేటు వద్ద కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని పేపర్ మిల్లు ఎంప్లాయిస్ ప్రొటెక్షన్ యూనియన్ (రిజిస్ట్రేషన్ నం. ఇ-2381) కార్యనిర్వాహక అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోలెం వెంకటేశం సందర్శించి దీక్ష చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గోలెం వెంకటేశం మాట్లాడుతూ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని 57 రోజులుగా శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు .యాజమాన్యం మొండి వైఖరిని కొనసాగిస్తే జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలతో పాటు ఆందోళన కార్యక్రమాలు, నిరసన కార్యక్రమాలను గురువారం నుంచి మరింత ఉధృతం చేస్తామని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలో పి. శ్రీనివాస్, జానకిరామ్, నీలి రాజన్న పాల్గొన్నారు. దీక్షకు జేఏసీ నాయకులు కల్లూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తన్నీరు పోషం, చిలుముల వెంకటేశ్వర్లు, బి. శంకర్, ఎం. లక్ష్మణ్, తిరుపతితో పాటు పలువురు కార్మికులు హాజరై సంఘీభావం ప్రకటించారు.




## డా. బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్

**- ఆగస్టు 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం**

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 15, ప్రభాతవార్త :**

డా. బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్ ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో బి.ఏ., బి.కాం., బి.ఎస్సీ. కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగిన అభ్యర్థులు యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 7, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం డిగ్రీ రెండో, మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, అలాగే 2022-23 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజులను కూడా ఆగస్టు 7లోగా తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు. ప్రవేశాలు, ఫీజుల చెల్లింపులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 9494314314, 9160144943, 9866398678 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు.

## వ్యవసాయ పొలంలో మొసలి పిల్ల ప్రత్యక్షం

**- సురక్షితంగా వార్ధా నదిలో విడిచిపెట్టిన అటవీశాఖ అధికారులు**

**సిర్పూర్(టి), జూలై 15, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామ శివారులోని వ్యవసాయ భూముల్లో బుధవారం ఓ మొసలి పిల్ల కనిపించడంతో గ్రామస్థులు అప్రమత్తమయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మొసలి పిల్లను సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. మొసలి పిల్లను గుర్తించి ఎలాంటి హాని కలగకుండా కాపాడిన గ్రామానికి చెందిన ఎల్ములే యశ్వంత్ను ఎఫ్ఆర్ఓ అభినందించారు. అనంతరం మొసలి పిల్లను సహజ ఆవాసమైన వార్ధా నదిలో సురక్షితంగా విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ, వన్యప్రాణులు దారి తప్పి గ్రామాల్లోకి వచ్చినా లేదా ఎక్కడైనా కనిపించినా వాటిని పట్టుకునే ప్రయత్నం చేయకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.



## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 15, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, విలేజ్ నెం. 12లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు భర్తీకి స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయునికి సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత గ్రామపంచాయతీకి చెందిన స్థానికులై ఉండాలని, 18 నుంచి 44 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండటంతో పాటు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. విద్యార్హత, నివాస ధ్రువీకరణ పత్రాలు తదితర అవసరమైన సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి, రెండు సెట్లలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. స్థానిక గ్రామపంచాయతీ నుంచి అర్హులైన అభ్యర్థులు లేనిపక్షంలో మండలంలోని ఇతర గ్రామపంచాయతీల మహిళా అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగ మహిళలకు 10 సంవత్సరాలు, మాజీ సైనికుల (ఎక్స్‌సర్వీస్) మహిళా అభ్యర్థులకు 3 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుందని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ వెల్లడించారు.



## 15వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 15, ప్రభాతవార్త :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలోని 15వ వార్డులో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలను గుర్తించి ప్రాధాన్యత ఆధారంగా శాశ్వత పరిష్కారాలు అందిస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పట్టణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కౌన్సిలర్ల సహకారంతో అన్ని వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ విద్యావతి, డా. కొత్తపల్లి శ్రీనివాస్, సీపీ రాజకుమార్, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

## 17న మెగా జాబ్‌మేళా

**నిర్మల్, జూలై 15, ప్రభాతవార్త:**

జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 11 గంటలకు నిర్మల్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి. విజయలక్ష్మి తెలిపారు. స్వాతంత్ర మైక్రోఫిన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో 50 లోన్ ఆఫీసర్ (అర్హత: టెన్త్, జీతం: రూ. 15 వేలు), 5 బ్రాంచ్ మేనేజర్ (అర్హత: డిగ్రీ, 3 ఏళ్ల అనుభవం, జీతం: రూ. 30 వేలు) పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఆసక్తి గల నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్, పాన్ కార్డులతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7208057571 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



## భూముల రీ సర్వేలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు

**- పకడ్బందీగా సర్వే నిర్వహించి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**- అదనపు కలెక్టర్ వి.రాములు**

**మంచిర్యాల, జూలై 15, ప్రభాతవార్త :**

ప్రభుత్వ ప్రతిష్మాత్మక భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం భీమారం మండలంలోని మద్దికల్ గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను ఆయన తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. గ్రామంలో 853 సర్వే నంబర్ల పరిధిలో 4,810 ఎకరాల భూమికి ముగ్గురు లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఒక సర్వేయర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో సర్వే కొనసాగుతోందని తెలిపారు. రీ సర్వే పూర్తయితే భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా స్పష్టమైన నక్షాలు సిద్ధమవుతాయని పేర్కొన్నారు. అనంతరం ఆరెపల్లి గ్రామం, భీమారం మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి అంకుశాపూర్‌లోని సమతా అగ్రో ఇండస్ట్రీస్‌ను పరిశీలించి మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యాన్ని గడువులోగా సరఫరా చేయాలని రైస్ మిల్లు నిర్వాహకులకు సూచించారు.

## పదోన్నతిపై శ్రీరాంపూర్‌కు వెళ్తున్న సురేష్ కుమార్‌కు ఘన సన్మానం

**మందమర్రి, జూలై 15, ప్రభాతవార్త**



సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మందమర్రి ఏరియాలో డి.జి.ఎం (ఈ అండ్ ఎం) గా స్టోర్స్ విభాగంలో సేవలందించిన ఎస్. సురేష్ కుమార్ పదోన్నతి పొంది శ్రీరాంపూర్ ఏరియాకు ఏరియా ఇంజనీర్‌గా వెళ్తున్న సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఇతర ఉన్నతాధికారులతో కలిసి సురేష్ కుమార్ ను శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా జి.ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ సురేష్ కుమార్ మందమర్రి ఏరియాలో అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. ఆయన స్నేహపూర్వక స్వభావం, మృదుస్వభావం, బాధ్యతాయుతమైన పనులను సమర్థవంతంగా నిర్వహించే తీరు ప్రశంసనీయమని తెలిపారు. తాను అప్పగించిన కీలక బాధ్యతలను ఆయన నిబద్ధతతో విజయవంతంగా పూర్తి చేసినట్లు గుర్తుచేశారు. పదోన్నతిపై శ్రీరాంపూర్ ఏరియాకు ఏరియా ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న సురేష్ కుమార్ కు హృదయపూర్వక అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ. టు జి.ఎం. జి.ఎల్. ప్రసాద్, బెల్లంపల్లి రీజియన్ జి.ఎం. (సేఫ్టీ) రఘు కుమార్, కేకే ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, ఎస్.కే. ఏజెంట్ సంతోష్ కుమార్, ఏరియా ఈ అండ్ ఎం. బాలాజీ భగవతి జా, ఎ.జి.ఎం. (అకౌంట్స్) ఆర్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, డి.జి.ఎం. (ఐ.ఈ.డి.) కె. కిరణ్ కుమార్, డి.జి.ఎం. (సర్వే) భుఖ్య దేశాయ్, డి.జి.ఎం. (పర్సనల్) సి.హెచ్. అశోక్ మరియు ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.